# కె. శివారెడ్డి

కవిత

# పక్కకి ఒత్తిగిలితే...



# పక్కకి ఒత్తిగిలితే...

పక్కకి
ఒత్తిగిలితే తగిలిందో వాక్యం
పూర్వం
ఒక రాజు
తనకీ పెళ్లానికీ మధ్య
కత్తి నాటాడట పక్క మధ్యలో-
ఎవరు కదిలినా
          రక్తం పలుకుతుంది
పండిన వేపకాయ హృదయం
తీయతీయగా చేదు చేదుగా
                    తడితడిగా.

అంతే
కవిత్వం రాయటమంటే
ఖడ్గంతో సహజీవనం చెయ్యటం-
మొద్దుబారటానికీ వీల్లేదు
మోడుగా మిగలటానికీ వీల్లేదు

*15 ఏప్రిల్ 2014*

# ఆమె ప్రపంచంలో

ఆమె ప్రపంచంలో ఆమె
మన ప్రపంచంలో మనం
రెండు ప్రపంచాలు ఎక్కడో విడివడ్డాయి-
మళ్లీ కలుస్తాయా! చెప్పలేం-

ఆమె ప్రపంచం ఎలా వుంటుందో
ఎలా కలగంటుందో చెప్పలేం-
ఆమె ప్రపంచంలో రోడ్లు కదులుతాయా
పక్షులెగురుతాయా, చెట్లు పాడతాయా
చెప్పలేం-
బహుశా కన్నీటిబొట్లని దారానికి
గుచ్చుతూ ఎవరో ఒక ఆవిడ
చెట్టు కింద కూచుని
మంచు మైదానాల మీదుగా, మహోధృతంగా
ఒక రైలు దూసుకెడుతూ వుంటుంది
ఏవేవో బాల్యపు కలలు, యౌవనపు స్వప్నాలు
అడ్డదిడ్డంగా పరుగెడుతూ చిక్కుపడతాయి
ఓ జవనాశ్వం ఓడ మీంచి
సముద్రంలోకి దూకుతుంది-

# భయం జంతువు

అప్పుడే భయం మొదలయింది
ఏం చేస్తే ఏమవుతుందో
ఏం రాస్తే ఏమవుతుందోననే భయం
మనుషుల మారుమూలల్లో- కాదు
మేధావుల, పత్రికాధిపతుల్లో, సంపాదకుల్లో-
ఎక్కడో ఒక క్రీనీడ వెంటాడుతున్నట్టు
మన నీడలో మరొకరి నీడ కలిసి నడుస్తున్నట్టు
నిఘా వేస్తున్నట్టు
స్వేచ్ఛాభావనలు ఈదురుగాలులు
రెల్లు కూడా వంగని నిర్వీర్యపు గాలులు
పీల్చే గాలిలో- ఇపుడేదో కలిసింది
క్రమక్రమంగా వాతావరణం మారుతుంది
ప్రమాదరహిత వృక్షచ్ఛాయలు ఎక్కడని వెతుకుతున్నాం
నిన్నటిదాకా ఏం రాశాం, ఏం మాట్లాడాం-
సంఖ్య భయపెడుతుందా, రంగు భయపెడుతుందా
గతాన్ని సైబర్ విప్లవంతో కలగలిపి
సాధించిన నమూనా అభివృద్ధి భయపెడుతుందా?
బుజాలు వేళ్లాడుతున్నాయి
కళ్లల్లో కళ్లు పెట్టి చూసే శక్తి నశించిందా?
మెడ మీద తల లేనట్టుండటం ప్రారంభమయిందా-

# రాత్రంటే

రాత్రంటే భయం నాకు
అది ఏ ఆకారంలో వచ్చి
          నన్ను చుట్టుకుంటుందోనని-
ఏఏ కలల్ని మూటగట్టి
          నెత్తిమీద పెట్టి నడవమంటుందోనని-
రాత్రి కమ్మగా హాయిగా నిదరపోదామంటే
ఎవరో వచ్చి గోళ్లలో సూదులు గుచ్చుతారు.
నిర్దాక్షిణ్యంగా వేళ్లు నరుకుతారు
ఇంత చలివెన్నెలనీ
దాని పక్కన జీరాడే మెత్తని చీకటినీ
పొదల్లో కదులుతున్న పిట్ట శబ్దాల్నీ
దిండు కింద దోపి, దిండులో ముఖం పెట్టి
నిర్భయంగా నిదరబోదామంటే-
శత్రువెవడో అప్పుడే యుద్ధానికి రమ్మంటాడు
రక్తం మీద సాక్షిగా సంధి చేసుకుందామంటాడు

చిన్నప్పుడెట్టా నిదరబోయేవాణ్ణో
ఎత్తు తక్కువ చిన్న మంచం మీద
బొక్క బోర్లా పడుకుని- తల దగ్గర
దీపం పెట్టుకుని పుస్తకం తీస్తే-

# వీధులే

కుక్కలు లేకపోతే
బజార్లకేమందం
ఏ తెల్లారగట్టో బయటికొస్తే
నిశ్శబ్ద నిశావీధుల మీద
నిన్ను పలకరించేవి అవే,
వాటిని బజారుకుక్కలంటాం
లోకం తెలియని మేలుజాతి
ఆల్సేషియన్ కుక్కలకేం తెల్సు
లోకం సంగతి, మనుషుల సంగతి
వీధులే యిళ్లుగా బతుకుతున్న
మనుషుల సంగతి,
ఇల్లన్నాక
ఒక కుక్క ఉండాలి, ఒక పిల్లి ఉండాలి
కోడుండాలి, కాకుండాలి, పిచ్చుకుండాలి
పుణికి, పుణికి కూస్తున్న ఓ గువ్వుండాలి
అన్నింటికీ ఆశ్రయమిచ్చే
ఒక పూరిల్లూ, ఒక చెట్టూ వుండాలి-
వీథో, యిల్లో
జంతువులు లేక
జనసందోహం లేక, ఏం బతుకుతాయి

# అతని కల

అతడు
తన చుట్టూ, ఇంటి చుట్టూ
          పుల్లలు నాటుతున్నాడు
అవి ఒకనాటికి మహావృక్షాలవుతాయని
అదొక ఉద్యానవనమో
మహా అరణ్యమో అవుతుందని అతని నమ్మకం-
అవి కనీసం పూలచెట్లన్నా కాలేదు,
ఇనపకమ్మీలవుతున్నాయి
ఇనపబద్దలో, కమ్మీలో
కొమ్మలూ, రెమ్మలూ వేసి
శాఖోపశాఖలై విస్తరిస్తున్నాయి
అంతటా ఇనుం వాసన
చెట్ల మధ్యన
ఉద్యానవనంలో విహరిద్దా
               మనుకున్న మనిషి
ఇనపలోకంలో ఇరుక్కుపోయాడు
ఏ దేవుడో వరమిచ్చినట్టు
తనేది ముట్టుకున్నా ఇనుమైపోతోంది,
ఇనుం కూడా పిల్లలు పెట్టి

# పొగ

పొగ భూమిలా పరుచుకున్నప్పుడు
భూమ్మీద పాదం మోపినట్టు
పొగమీద పాదం మోపుతావు
ఒక మహాసర్పంలా నిన్నది చుట్టచుట్టి
కనపడని లోకాలకెత్తు కెళ్లిపోతుంది
పొగ, పొగమంచూ కాదు
దుమ్మూధూళీ కాదు
తుఫాను కసురూ కాదు
పొగ కనులకెనకమాల
పరుచుకున్న నీలాకాశమూ కాదు
పొగ పొగే.
పొగలో చిక్కుకున్నవాడు చూళ్లేడు
చూసినా వాస్తవాన్ని గ్రహించలేడు
రాయి అని కూచుంటే
రాయి పొగ అవుతుంది
ఇల్లనుకుని విశ్రాంతి తీసుకుందామనుకుంటే
భయంకరమయిన ఊబి అవుతుంది
రాత్రిళ్లు నా తల దగ్గర నుంచుంటుంది
నా కలల్లోకి ప్రవేశించాలని దాని ప్రయత్నం
దారి దొరక్క దేవులాడుతుంది

# భూమి

లోపల
గ్లాసులు నిండి కళ్లు పొర్లిపోతాయి
గ్లాసులోని కొవ్వొత్తి దీపం పీటకింద పిల్లికూనలా-
ఎత్తైన అంచుదాటి కిందకు దూకే నీళ్ల కేశాల
గాలి కలవరింతలు.

మృగం సంచరించదు.
చెట్టు కింద పడుకుని కళ్లు మూస్తూ తెరుస్తూ-
యుగయుగాల్నుంచి తను తయారుచేయదల్చుకున్న
పూర్ణాయుధం తయారీలో కొలిమి ముందు కూర్చున్న
కమ్మరి సముద్రుడు.

ఒక నీలి జ్వరకాంతి పరివ్యాప్తమై మాదకత నాశీర్వదిస్తూ-
పర్వతాలు ఘర్షించుకుంటూ వర్షించుకుంటూ
బీజం పొట్ట చీల్చుకు వస్తున్న అంకురం పాడే సంగీతం

Just
ఒక కుక్కటూ, ఒక పందిటూ వెళ్లిపోతాయి
పాత రాతియుగపు పనిముట్లు దొరుకుతాయి.
రోమ్‌లో శిథిల యాంఫీ థియేటర్ విషాదకావ్యం ముగుస్తుంది
శాంశన్ చేతులు నదులై అల్లుకుపోతాయి

# ఎక్కడ్నుంచో

ఎక్కడ్నుంచో
రెండు చినుకులు రాలాయి
సమస్త ఆకాశాలు రెక్కలు ముడిచి
కళ్ల మీద దిగుతున్నాయి-
ఏ సాంద్ర అరణ్యప్రాంతం నుంచి
వచ్చిందీ జంతువు
కొమ్ములూ, రెక్కలున్న జంతువు
ఎన్ని వేల సంవత్సరాల
తమస్సును గూడేస్తుంది
చేను నిండుతుందా
చెరువు పండుతుందా
ఆదిమ దశ నుంచి, రాగల కాలందాకా
కెరటాలు లేని ఈ నది ప్రవహిస్తుందా
ముక్కలు ముక్కలయిన విగ్రహం
మళ్లీ ప్రాణం పోసుకుంటుంది
వేలవేల రెక్కలతో ఎగరటానికి సిద్ధమౌతుంది

చినుకులు రాలుతున్నాయి
నదిమొవ్వల కనురెప్పల మీద

# ఎక్కడయితే

ఎక్కడయితే నువ్వుండీ
ఏమీ చేయలేవో
దేన్నీ ఆపలేవో-
నువ్వుండి కూడా నిరర్థకం
నిర్వేదపు చిహ్నంగా మిగిలిపోతావు
ఏమీ చేయలేవు
దేన్నీ కదపలేవు
నువ్వుండీ ఉపయోగమేమిటి
ఉండటం లేకపోవటం ఒకటే అన్పించదూ
గాజుకళ్లతో చూడటం
వట్టి చేతులతో భూమిని తవ్వటం-
నీ నీడ నిన్ను హింస పెడుతుంది
మోకాళ్ల లోతునీళ్లలో తొక్కుతుంది
చిత్రహింసలకు గురయిన చెట్టుకాండం
కొండలపై పద్యాలు రాద్దామని
యినపచేతులు ధరించావు
డబ్బుమోతల్లో నిమజ్జనం జరుగుతుంది
చెరువు పొట్ట
లివర్ పేషెంట్‌లా ఉబ్బుతుంది
నువ్వుంటావు

# విషాద సారంగధరం

నలభై ఏళ్ల కొడుకు మీద
డెబ్భై ఏళ్ల తండ్రి అరుస్తున్నాడు
కారణమేదయినా గావొచ్చు
          అదొక విషాద సన్నివేశమే
వ్యవస్థ ముఖమంతా
          అక్కడ తొంగిచూస్తుంది
సామాజిక మంచిచెడులన్నీ
          సంబంధ బాంధవ్యాలన్నీ
ఇద్దరి మనుషుల మధ్య ప్రతిఫలిస్తాయి
ఏ విలువ ఎక్కడ ఎట్టా పేరుకుపోయిందో
అదే చెబుతుంది మొత్తం స్థితిని

ఒక సామాజిక విషాదం
          వ్యక్తిగత విషాదం కూడా
ఖండఖండాలవుతున్న సమాజం
మనుషుల్ని మాంసఖండాల కింద నరుకుతుంది
ఇద్దరి మధ్య
ఏ యిద్దరి మధ్యయినా
ఇంత హింసా, ఇంత క్రూరత్వమా
ఇంత తడిలేనితనమా

# ఇంకొంచెం

ఇంకొంచెం వయసు రావాలి
నే చెప్పే విషయాలు అర్థమవటానికి
చూసిందే ప్రపంచమనుకుంటున్నావు
ప్రపంచంలో ప్రపంచం చూడటానికి
ఇంకొంచెం వయసు రావాలి,
కనపడే శరీరంగాదు
కనపడని శరీరం లోలోపల కాలుతూ వుంటుంది
కాగడా పట్టుకు తిరుగుతూ వుంటుంది
చర్మం కింద రాతల్ని
గోడ మీద బొమ్మల్నీ
బొమ్మ లోపలి గృహచ్ఛిద్రాల్ని చూడటానికి
ఇంకొంచెం వయసు రావాలి
ఇంకొంచెం కళ్లు పెద్దవి చేసుకుని చూడాలి
ఈ పుస్తకంలో ఒక పేజీ మిస్సయింది
పూరించగలవా
శోధించగలవా
ఇక్కడెక్కడో ఒక మనిషుండాలి
గమనించగలవా, గుర్తుపట్టగలవా
గుర్తుపట్టి వాడి నెత్తిన కిరీటం పెట్టగలవా

# కోరికని

అగ్నిగోళాన్ని
కడుపులో దాచుకుని బతకటం
ఎన్నాళ్లంటే- బతికినన్నాళ్లు
అది సుఖమా దుఃఖమా అంటే
అదీ చెప్పలేం
ఏదీ చెప్పలేని, దేన్నీ చెప్పలేని
దేన్నీ విప్పలేని స్థితి ఎన్నాళ్లంటే
కంఠంలో ఊపిరున్నన్నాళ్లు
కడుపునిండా గాలి పీల్చుకున్నన్నాళ్లు-
మనం చూస్తూ వుంటాం
మనముందంతా తగలబడుతూ వుంటుంది
గుండెలు బాదుకుని అరిచినా
అదలా కణకణ కాలుతూనే వుంటుంది
దాని సంగీతమది పాడుతూనే వుంటుంది
ఎవడు మంటబెడితే ఏమిటి
అంటుకున్నాక అది ఆరదు, ఆగదు
ఆఖరి ఆక్రోశం వరకు
అది దహించక మానదు
పాము ముట్టినవాడు
మెలికలు తిరిగిపోతూ వుంటాడు,

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Pakkaki+Ottigilite**

* * *